





గుడిపల్లి మండలంలో నారా భువనేశ్వరికి సాదర స్వాగతం





'రాజధాని' చుట్టూనే 'బడ్జెట్'
'వెనుకబాటు' ఊసేలేదు

ప్రజాశక్తి - తిరుపతి టౌన్

'రాజధాని' అమరావతి చుట్టూనే కేంద్ర బడ్జెట్ తిరగాడింది.. 'సబ్‌కా సాథ్... సబ్‌కా వికాస్' అంటూ అందరిలో మనం ఉన్నాం తప్ప, ప్రత్యేకించి వెనుకబడి జిల్లాలైన తిరుపతి, చిత్తూరు జిల్లాలకు ఒరిగిందేమీ లేదనే చెప్పాలి. పేద, మధ్యతరగతి ప్రజల గృహ నిర్మాణాలకు 10 లక్షల కోట్లు కేటాయించారు. అందులో మనం ఉంటాం. అలాగే మహిళలు, బాలికల పథకాలకు 3 లక్షల కోట్లు ప్రతిపాదించారు. పన్ను చెల్లింపుదారులకు కొంతమేర ఉపశమనం కల్పిస్తున్నట్లు కేంద్ర ఆర్థికమంత్రి నిర్మలా సీతారామన్ మంగళవారం కేంద్ర బడ్జెట్‌ను వెల్లడించారు. ఏదిఏమైనా బడ్జెట్‌పై రాజకీయ ప్రతినిధుల నుంచి మిశ్రమ స్పందన లభించింది. టిడిపి కూటమి మాత్రం రాజధానికి నిధుల కేటాయింపుపై హర్షం వ్యక్తం చేస్తూ సంబరంగా ప్రకటించారు. అయితే జిల్లాకు ఏంటనేది? వారి దగ్గర సమాధానం లేదనే చెప్పాలి. లెదర్ ఉత్పత్తులపై పన్ను తగ్గిస్తూ, ప్లాస్టిక్ వాటిపై వాయించింది.

మొబైల్స్, సోలార్ ఉత్పత్తులపై పన్ను తగ్గించింది. అలాగే బంగారం, వెండిపై ఆరు శాతం, ప్లాటినంపై 6.4 శాతం బేసిక్ కస్టమ్స్ డ్యూటీ తగ్గిస్తోంది. మూడు రకాల క్యాన్సర్ మందులపైనా పన్నులు తగ్గించింది. మహిళల ఆస్తుల రిజిస్ట్రేషన్లపై స్టాంపుల డ్యూటీ తగ్గించింది. మహిళలకు ఉద్యోగాల్లో ప్రాతినిధ్యం పెంచేందుకు ప్రత్యేక హాస్టల్స్ ఏర్పాటు చేయనుంది. ముద్ర రుణాలను 10 లక్షల నుంచి 20 లక్షలకు పెంచుతూ నిర్ణయం తీసుకున్నారు.

విభజన హామీల ఊసేది : వి.నాగరాజు, జిల్లా కార్యదర్శి, సిపిఎం



కేంద్ర ప్రభుత్వ బడ్జెట్ జిల్లావాసులకు తీవ్ర నిరాశనే మిగిల్చింది. మాటలు ఘనం.. నిధులు నిల్ అన్నట్లుగా ఉంది. ఎన్నికల అనంతరమైనా ఆంధ్రప్రదేశ్‌కు న్యాయం జరుగుతుందని, భారీగా నిధులు వస్తాయని, విభజన చట్టంలోని అంశాలు అమలు చేస్తారని అందరూ ఆశించారు. మన్నవరం పునరుద్ధరణగానీ, కడప ఉక్కు గురించి గానీ ప్రస్తావనే లేకుండా పోయింది. రెండు పారిశ్రామిక కారిడార్లకు నిధుల గురించి ప్రస్తావన లేదు.

ఉద్యోగ కార్మిక వ్యతిరేక బడ్జెట్ : కందారపు మురళి, సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి



ఉద్యోగ కార్మిక వ్యతిరేక బడ్జెట్‌గా ఉంది. ప్రతి ఏటా కోటిమందికి ఉపాధి కల్పించేందుకు మూడు పథకాలు ప్రవేశపెట్టామని గొప్పగా చెప్పారు. వాస్తవంగా ఈ పథకాలేవీ ఉపాధి పెంచేవి కావు. కొత్తగా ఉద్యోగం ఇచ్చిన యజమానులకు మొదటి నెల జీతాన్ని తిరిగి చెల్లిస్తామని, అలాగే కొత్త ఉద్యోగులకు యజమానులు చెల్లించాల్సిన ఈపీఎఫ్ వాటాను ప్రభుత్వం మరి కొంత కాలం పాటు చెల్లిస్తుందని అందువల్ల ఉద్యోగాలు పెరుగుతాయని చెప్పిన మాట వాస్తవం కాదు. ఇవి ప్రజల డబ్బులను యజమానులకు దోచిపెట్టే పథకాలు మాత్రమే. 2022 – 2023 ఆర్థిక సంవత్సరంలో గ్రామీణ ఉపాధికి ఖర్చు చేసిన మొత్తం కంటే ఈ బడ్జెట్లో చేసిన కేటాయింపు తక్కువగా ఉంది. ఇక ఉపాధి పెరిగేది ఎక్కడ?

కేంద్ర బడ్జెట్‌పై చంద్రబాబు మార్క్ : నరసింహ యాదవ్, టిడిపి



కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మల సీతారామన్ ప్రవేశపెట్టిన బడ్జెట్ పై ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు మార్క్ స్పష్టంగా ఉంది. రాష్ట్ర ప్రయోజనాల కోసం కేంద్ర ప్రభుత్వం బడ్జెట్లో 15వేల కోట్లను కేటాయించడం ఆహ్వానించదగ్గ అంశం. పోలవరం త్వరగా పూర్తి కావడానికి, వెనుకబడిన జిల్లాల అభివద్ధికే కాకుండా పలు అభివద్ధి కార్యక్రమాలకు నిధులు మంజూరు చేస్తానని సభలో చెప్పడం సంతోషంగా ఉంది. పట్టణాభివద్ధి సంస్థలకు ప్రత్యేక నిధులు మంజూరు చేస్తానని హామీ ఇచ్చారు. దేశవ్యాప్తంగా యువతకు ఉపాధి అవకాశాల కల్పన, విభజన హామీల అమలకు సీఎం చంద్రబాబు నాయుడు, ఉప సీఎం కొణిదెల పవన్ కళ్యాణ్ సమిష్టిగా కృషి చేస్తారు.

ఏపీకి ప్రత్యేక సాయం హర్షణీయం : బొజ్జల సుధీర్‌రెడ్డి, ఎంఎల్ఎ, శ్రీకాళహస్తి



కేంద్ర బడ్జెట్లో రాష్ట్రానికి అధిక ప్రాధాన్యతనిస్తూ నిధులు కేటాయించడం హర్షణీయం. రాజధాని అమరావతి, జీవనాడి పోలవరం ప్రాజెక్టుల పూర్తి కోసం సంపూర్ణ సహకారం అందిస్తామని ప్రకటిస్తూ రాష్ట్ర పునర్నిర్మాణానికి రూ.15 వేల కోట్లు కేటాయించడం ఇందుకు నిదర్శనమన్నారు. అదేవిధంగా ఆగిపోయిన వెనుకబడిన ప్రాంతాలకు అభివద్ధికి ప్రత్యేక నిధులు ఇస్తామని చెప్పడం రాష్ట్ర ప్రగతికి, నియోజకవర్గాల అభివద్ధికి తోడ్పడుతుంది.

పెన్షనర్లను నిరాశపర్చింది : టి.గోపాల్, సంఘం జిల్లా సహ అధ్యక్షులు



దేశవ్యాప్తంగా రెండు కోట్ల మంది ఉద్యోగులను , పెన్షనర్లను నిరాశపర్చింది. ఉద్యోగులు, ఉపాధ్యాయుల భవిష్యత్ అవసరాలను దృష్టిలో పెట్టుకుని భవిష్య నిధి రూపంలో, ఎల్ఐసి రూపంలో ఇతర సేవింగ్స్ పథకాల కింద ఏడాదికి లక్షలాది రూపాయలు పొదుపు చేసుకుంటారు. కానీ గత ఐదేళ్లుగా పొదుపు పథకాలకు చరమగీతం పాడి, ఆదాయపు పన్ను మినహాయింపు పొందే పరిమితిని లక్షా 50వేలకే నిర్ణయించింది. ఆదాయపు పన్నులో ఎలాంటి రాయితీ పరిమితి పెంచలేదు. పాత పద్ధతి కింద ఓల్డ్ రెస్యూమ్ పన్నుల స్లాబ్‌లో మార్పులు చేసి పరోక్షంగా వార్షిక జీతంలో మధ్యతరగతి ఉద్యోగుల నుంచి, పెన్షనర్ల నుంచి పది శాతం పన్నుల రూపంలో లాక్కుంటుంది. మధ్యతరగతి ఉద్యోగి ఏడాదిలో రెండు నెలల జీతం పన్నుల రూపంలోనే చెల్లించాల్సిన దౌర్భాగ్యం ఏర్పడుతోంది. పెన్షన్ మొత్తానికి పూర్తిగా ఆదాయపు పన్ను మినహాయింపు ఇవ్వాలి.

వేతన జీవులకు నిరాశ : కె.ముత్యాలరెడ్డి, యుటిఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి



పాత పన్నుల విధానంలో మార్పు చేయకుండా, కొత్త పన్ను విధానంలో స్వల్ప మార్పులు తీసుకొచ్చి అమలు చేయడం వల్ల ఈ బడ్జెట్ వేతన జీవులకు నిరుపయోగం. సిపిఎస్ విధానంలో మార్పులు చేస్తామని చెబుతూనే పాత పెన్షన్ విధానం అమలుపై ప్రకటన లేకపోవడం ఉద్యోగ ఉపాధ్యాయులను తీవ్ర నిరాశపరిచింది. ఉద్యోగుల ఆదాయ పన్ను సంబంధించి కొత్త విధానములో ఎక్కువ పన్ను చెల్లించాల్సి రావడంతో ఎక్కువమంది పాత విధానం వైపు మొగ్గుచూపుతున్నారు. కేంద్రం ఆ దిశగా రాయితీలు లేకుండా చేయడం నిరాశ పరిచింది. విద్యారంగానికి సైతం 6 శాతం బదులు 3.25 శాతం నిధులు కేటాయించడం విద్యారంగం పట్ల కేంద్ర ప్రభుత్వ వైఖరిని తెలియజేస్తుంది.

ప్రజలను ఏమార్చేలా : యార్లపల్లి గోపి, కాంగ్రెస్



కేంద్ర బడ్జెట్ రాష్ట్ర ప్రజలను ఏమార్చేలా ఉంది. ఆంధ్ర రాష్ట్రానికి మరోసారి అన్యాయం జరిగింది. ప్రత్యేక హోదాపై ప్రస్తావన లేదు. వెనుకబడిన రాయలసీమకు ప్రత్యేక ప్యాకేజి కింద నిధులు విడుదల చేయడం లేదు. పోలవరం ఎప్పటిలోపు పూర్తి చేస్తారో స్పష్టత లేదు. రాజధానికి ఇచ్చే నిధులు అప్పా, కేంద్రమే భరిస్తుందా అనేది అనుమానాలకు తావిస్తోంది. చిత్తూరు జిల్లా అభ్యున్నతికి నిధుల కేటాయింపు ఊసేలేదు. రైతులకు రుణమాఫీ ప్రకటన లేదు. మన్నవరం గుర్తించి ప్రస్తావించకపోవడం మోసకారితనానికి నిదర్శనం. రైల్వేపరంగానూ ఒరిగిందేమీ లేదు.

విభజన హామీల అమలు ఏది? : పి.మురళి, జిల్లా కార్యదర్శి, సిపిఐ



ఏపీ రాజధాని నిర్మాణానికి నేరుగా సాయం అందిస్తామని కేంద్ర ఆర్థికశాఖ మంత్రి నిర్మలా సీతారామన్ చెప్పకపోవడం శోచనీయం. మల్టీ లేటరల్ డెవలప్‌మెంట్ ఏజెన్సీల ద్వారా రూ.15 వేల కోట్ల ఆర్థిక మద్దతు అందిస్తామని కేంద్ర మంత్రి పేర్కొన్నారు. రాజధాని నిర్మాణానికి రూ.15 వేల కోట్లు గ్రాంటా? లేక అప్పా? అనేది తేల్చాలి. పోలవరాన్ని నిర్దేశిత సమయంలో పూర్తి చేస్తామని చెప్పిన పాపాన పోలేదు. వెనుకబడిన జిల్లాలకు ఎంత మేరకు సాయం చేస్తారనే విషయమై స్పష్టత లేదు. ఏపీతో పోలిస్తే బీహార్ రాష్ట్రానికి అత్యధిక ప్రాజెక్టులు ఇచ్చారు.

ఏపీకి ఇచ్చేది గ్రాంటా? అప్పా? : గురుమూర్తి, ఎంపి



ఏపీ రాజధాని నిర్మాణానికి నేరుగా సాయం అందిస్తామని కేంద్ర ఆర్థికశాఖ మంత్రి నిర్మలా సీతారామన్ చెప్పలేదు. మల్టీ లేటరల్ డెవలప్‌మెంట్ ఏజెన్సీల ద్వారా రూ.15 వేల కోట్ల ఆర్థిక మద్దతు అందిస్తామని చెప్పారు. రాజధాని నిర్మాణానికి రూ.15 వేల కోట్లు గ్రాంటా? లేక అప్పా? అనేది తేల్చాలి. ఎట్టి పరిస్థితుల్లోనూ అప్పు భారాన్ని మోపవద్దు. పోలవరాన్ని పూర్తి చేస్తామని పదేళ్లుగా కేంద్రం చెబుతూనే ఉంది. పోలవరానికి నిధులిస్తున్న పాపాన పోలేదు. ఏపి విభజన సమస్యల పరిష్కారానికి పదేళ్లుగా పార్లమెంట్‌లో వైసీపీ పోరాడుతోంది. అయినా కేంద్రం నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తోంది. ఏపితో పోలిస్తే బీహార్‌కు అత్యధిక ప్రాజెక్టులు ఇచ్చారు.

దత్తత గ్రామాల్లో నారా భువనేశ్వరి
ఎన్టీఆర్ ట్రస్టు ద్వారా మౌలిక సదుపాయాలు

ప్రజాశక్తి - గుడిపల్లి (చిత్తూరు జిల్లా)

కుప్పం నియోజకవర్గం గుడిపల్లి మండలం కంచిబందార్లపల్లిని దత్తత తీసుకుని, ఎన్టీఆర్ ట్రస్టు ద్వారా మౌలిక సమస్యలు పరిష్కరిస్తామని సిఎం చంద్రబాబునాయుడు సతీమణి నారా భువనేశ్వరి వెల్లడించారు. నారా చంద్రబాబునాయుడుకు భారీ మెజార్టీని ఇచ్చిన గ్రామాలను దత్తత తీసుకుంటామని ఎన్నికల ప్రచారంలో భాగంగా నారా భువనేశ్వరి ఎన్నికల హామీగా గతంలో ప్రకటించారు. ఈ నేపథ్యంలో నాలుగు రోజుల పర్యటనలో భాగంగా కుప్పం నియోజకవర్గానికి విచ్చేసిన ఆమె మంగళవారం సాయంత్రం గుడిపల్లి మండలంలో పర్యటించారు. చంద్రబాబునాయుడు సిఎం అయిన తరువాత తొలిసారిగా కుప్పం నియోజకవర్గానికి విచ్చేసిన ఆమెకు ఘన స్వాగతం లభించింది. క్రేన్లతో భారీ పూలమాలలు వేశారు. అడుగడుగునా కర్పూర హారతులు పట్టారు. తొలుత మండలంలోని కమ్మగుట్టపల్లి గ్రామంలో రచ్చబండ నిర్వహించారు. గ్రామంలో సమస్యలను అడిగి తెలుసుకున్నారు. గతంలో ఇచ్చిన హామీ ప్రకారం ఎక్కడైతే తెలుగుదేశం పార్టీకి అత్యధిక మెజార్టీ వచ్చిన గ్రామాల్లో ఆమె పర్యటించనున్నారు. గుడిపల్లి మండలంలోని కంచిబందార్లపల్లి గ్రామాన్ని దత్తత తీసుకుంటున్నట్లు ప్రకటించారు. అలాగే గుండ్లసాగరం పంచాయతీ గుత్తార్లపల్లి, చీకటిపల్లి పంచాయతీ కోటపల్లిల్లో పర్యటించారు. తూర్పు రాయలసీమ పట్టభద్రుల ఎంఎల్‌సి కంచర్ల శ్రీకాంత్, పార్టీ అధ్యక్షులు టిఎం బాబునాయుడు పర్యటనలో పాల్గొన్నారు. హైదరాబాద్ నుంచి ఉదయం 8.35కు బయల్దేరి నారా భువనేశ్వరి 12.15 గంటలకు విమాన, రోడ్డు మార్గాల్లో గుడిపల్లికి చేరుకున్నారు. సాయంత్రం కుప్పం పిఇఎస్ గెస్ట్‌హౌస్‌లో బస చేయనున్నారు.



తోపుడుబండ్ల వ్యాపారస్తుల సదస్సులో మాట్లాడుతున్న కందారపు మురళి

హాకర్లపై దాడిని ఖండించండి : సిఐటియు

ప్రజాశక్తి - తిరుపతి టౌన్

తోపుడుబండ్ల వ్యాపారులపై జరుగుతున్న వరుస దాడులకు వ్యతిరేకంగా తోపుడుబండ్ల వ్యాపారస్తుల సంఘం ఆధ్వర్యంలో మంగళవారం యశోదానగర్‌లోని వేమన విజ్ఞాన కేంద్రంలో సదస్సు జరిగింది. తిరుపతిలోని చిరువ్యాపారులు పాల్గొన్నారు. హాకర్స్ యూనియన్ నగర ప్రధాన కార్యదర్శి పి.బుజ్జి అధ్యక్షత వహించారు. సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి కందారపు మురళి, అధ్యక్షులు జి.బాలసుబ్రమణ్యం మాట్లాడుతూ తోపుడుబండ్లపై వ్యాపారం చేసుకుంటూ బతుకు జీవనం సాగిస్తున్న చిరువ్యాపారులపై దాడులను ప్రతి ఒక్కరూ ఖండించాలన్నారు. కరోనా మహమ్మారి తరువాత ఉద్యోగాలు కోల్పోయి చిరువ్యాపారుల సంఖ్య బాగా పెరిగిందన్నారు. వైసిపి హయాంలో ఎక్కడబడితే అక్కడ మొబైల్ క్యాంటీన్లను పెట్టడం వల్ల తోపుడుబండ్ల వ్యాపారుల ఉపాధికి దెబ్బ పడిందన్నారు. గేటు పేరుతో అక్రమంగా డబ్బులు వసూలు చేస్తున్నారన్నారు. ఈ దందాను అరికట్టాలన్నారు. ప్రస్తుతం టిడిపి కూటమి నాయకులు వారి మనుష్యులను పెట్టి వ్యాపారం చేయించడానికి ప్రయత్నాలు చేస్తున్నారన్నారు. చిరు వ్యాపారులపై కక్షసాధింపు చర్యలేంటని ప్రశ్నించారు. తిరుపతి నగరంలో దాదాపు 3–4వేలకు పైగా తోపుడుబండ్ల వ్యాపారులు ఉన్నారన్నారు. వీధి వర్తక వ్యాపార చట్టం ప్రకారం తక్షణమే వారికి గుర్తింపు కార్డులు ఇవ్వాలని, అక్రమ గేట్ వసూలు ఆపాలని, లేనిచో మున్సిపల్ కార్యాలయాన్ని ముట్టడిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో నాయకులు మాధవ్ కృష్ణ, వేణుగోపాల్, పి.ప్రసాద్, గోవిందు, మునిరత్నం, మాధవి, సురేష్ తదితరులు పాల్గొన్నారు.



ఆస్పత్రిలో అంగన్‌వాడీని పరామర్శిస్తున్న సిఐటియు నాయకులు అంగేరి పుల్లయ్య

రాజకీయ వేధింపులతో అంగన్‌వాడీకి అస్వస్థత

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి

రాజకీయ ఒత్తిళ్లు తాళలేక అంగన్వాడీ కార్యకర్త తీవ్ర అస్వస్థకు గురై ఆసుపత్రి పాలైన ఘటన మంగళవారం తిరుపతి జిల్లా శ్రీకాళహస్తి మండలం మన్నవరం గ్రామంలో చోటుచేసుకుంది. ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న అంగన్వాడీ కార్యకర్త గాయత్రిని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షులు అంగేరి పుల్లయ్య స్థానిక ఏరియా ఆసుపత్రిలో పరామర్శించారు. ఘటన జరిగిన తీరును అడిగి తెలుసుకున్నారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ గాయత్రి గత నాలుగేళ్లుగా నిబద్ధతతో అంగన్‌వాడీ కార్యకర్తగా సేవలందిస్తోందన్నారు. ప్రస్తుతం రాజకీయ వేధింపులకు సిడిపిఒ వంతపాడడంతో మానసికంగా కుంగిపోయింది. ఖచ్చితంగా తొలగిస్తామని సిడిపిఒ బెదిరించడంతో అనారోగ్యంపాలైన గాయత్రి శ్రీకాళహస్తి ఏరియా ఆస్పత్రిలో చికిత్స పొందుతోందన్నారు. సిడిపిఒను సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు. ఈ విషయమై సిడిపిఒ శాంతిదుర్గను 'ప్రజాశక్తి' వివరణ కోరగా అంగన్‌వాడీ కార్యకర్త గాయత్రి స్థానికంగా మన్నవరంలో ఉండటం లేదంటూ ఆ పంచాయతీ కార్యదర్శి ఇచ్చిన ఫిర్యాదు మేరకు విచారణకు వెళ్లినట్లు తెలిపారు. అయితే గాయత్రి మన్నవరంలోనే నివాసం ఉండటం గమనార్హం. గాయత్రిని పరామర్శించిన వారిలో నాయకులు పెనగడం గురవయ్య, గంధం మణి ఉన్నారు.

ధ్యానచంద్ర, అదితిసింగ్‌లకు సాదర వీడ్కోలు

ప్రజాశక్తి - తిరుపతి టౌన్

తిరుపతి జిల్లాలో జాయింట్ కలెక్టర్‌గా పనిచేసి విజయవాడ కార్పొరేషన్ కమిషనర్‌గా వెళుతున్న ధ్యానచంద్రకు, కడప జిల్లా జేసీగా బదిలీపై వెళుతున్న తిరుపతి మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ అదితిసింగ్‌కు సాదర వీడ్కోలు లభించింది. వారి సేవలను కలెక్టర్ డాక్టర్ ఎస్.వెంకటేశ్వర్ కొనియాడారు. మంగళవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో వీడ్కోలు సమావేశం నిర్వహించారు. తిరుపతి జిల్లా ఎన్నికల నిర్వహణ సమయంలో ధ్యానచంద్ర, అదితిసింగ్ సమర్థవంతంగా విధులు నిర్వహించారని, వీరి సేవలు ఎనలేనివని అన్నారు. ఆర్డీవోలు కిరణ్‌కుమార్, చంద్రముని, నిషాంత్‌రెడ్డి, రవి శంకర్‌రెడ్డి పాల్గొన్నారు.



జేసీ ధ్యానచంద్రకు వీడ్కోలు పలుకుతూ..

గుండెపోటుతో యువ రైతు మృతి

ప్రజాశక్తి - రామచంద్రాపురం



గుండెపోటుతో యువ రైతు పి.హేమంత్ (31) మృతిచెందిన ఘటన సోమవారం ఉదయం 9 గంటలకు రామచంద్రాపురం మండలం రేకలచేను గ్రామంలో చోటు చేసుకుంది. పచ్చార్ల హేమంత్ పొలం వద్దకు గట్టుపై వెళుతుండగా గుండెపోటుతో వరి మడిలో బురదలో పడిపోయాడు. అతను పడిపోయిన స్థలం ఊరికి దూరంగా ఉంది. అయితే పది గ్రామ శునకాలు మృతుడు హేమంత్ పడినచోటకు వెళ్లి గట్టిగా అరిచాయి. దీంతో స్థానికులు గుర్తించి హేమంత్‌ను బయటకు తీసుకొచ్చారు. నాడి పనిచేయకపోవడంతో 108కు ఫోన్ చేసి సమాచారం ఇచ్చారు. స్థానికులు విద్యుత్ షాక్‌తో మృతిచెందాడేమోనని మొదట అనుమానం వ్యక్తం చేశారు. విద్యుత్ శాఖ అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ హరిప్రసాద్, రామచంద్రాపురం పోలీసులు, 108 సిబ్బంది సంఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. హేమంత్ గుండెనొప్పితో వైద్యపరీక్షలు చేయించుకునేవాడని, గుండెపోటుతోనే మృతిచెంది ఉండొచ్చని స్థానికులు తెలిపారు. మృతునికి భార్య, ఓ కుమారుడు, తల్లిదండ్రులు, తమ్ముడు ఉన్నారు. కుటుంబానికి ప్రధాన జీవనాధారం కావడంతో అతని కుటుంబం వీధినపడింది. ప్రభుత్వం ఆదుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

తూపిలపాలెం పర్యాటకాభివృద్ధికి చర్యలు : కలెక్టర్

ప్రజాశక్తి - తిరుపతి టౌన్

తూపిలిపాలెం బీచ్‌ల పర్యాటకాభివృద్ధికి త్వరితగతిన భూమిని అప్పగించేందుకు చర్యలు చేపట్టాలని రెవెన్యూ అధికారులను కలెక్టర్ ఎస్.వెంకటేశ్వర్ ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్ ఛాంబర్‌లో గూడూరు డివిజన్‌లోని వాకాడు మండలం తూపిలిపాలెం బీచ్‌లో రిసార్ట్స్‌కు అందుబాటులో 6.50 ఎకరాల భూమిని పర్యాటక శాఖకు అప్పగించాలని తహశీల్దార్‌ను ఆదేశించారు. జిల్లా పర్యాటక శాఖ అధికారి రూపేంద్రనాథ్‌రెడ్డి కలెక్టర్‌కు వివరిస్తూ రిసార్ట్స్ ఏర్పాటు, వాటర్ స్పోర్ట్స్‌కు చర్యలు తీసుకున్నామన్నారు.

నెయ్యి సరఫరా కాంట్రాక్టర్లపై చర్యలు : ఈవో



కల్యాణకట్టలో ఈవో తనిఖీలు

ప్రజాశక్తి -తిరుమల

తిరుమల శ్రీవారి లడ్డూ ప్రసాదాలు మరింత నాణ్యంగా, రుచికరంగా అందించాలనే లక్ష్యంతో, ఇప్పటికే తీసుకున్న చర్యల వలన లడ్డూ ప్రసాదాల రుచి, నాణ్యత పెరిగిందని టిటిడి ఈవో జె. శ్యామలరావు చెప్పారు. అదేవిధంగా తక్కువ నాణ్యత గల నెయ్యిని సరఫరా చేస్తున్న సరఫరాదారులు నిబంధనలు పాటించకుంటే కఠిన చర్యలు తీసుకుంటామని ఈవో హెచ్చరించారు. తిరుమల గోకులం విశ్రాంతి భవనంలోని సమావేశ మందిరంలో మంగళవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ లడ్డూ నాణ్యతపై ప్రత్యేక దష్టి పెట్టామని, నాణ్యమైన నెయ్యి ద్వారా లడ్డూ నాణ్యత పెరుగుతుందని నిపుణులు తెలిపారన్నారు. ప్రస్తుతానికి అడల్ట్రేషన్ టెస్ట్ చేసే పరికరం టీటీడీ వద్ద లేదని, త్వరలో ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. ముడిసరుకులు, నెయ్యి ప్రొక్యూర్ మెంట్ సిస్టంలో కొన్ని ఇబ్బందులు ఉన్నాయన్నారు. నాణ్యమైన నెయ్యి కొనుగోలుకు సంబంధించి నలుగురు ప్రముఖ డెయిరీ నిపుణులతో కమిటీ ఏర్పాటు చేశామన్నారు. ఇందులో ఎన్ డిఆర్ఏ విశ్రాంత ఆచార్యులు డా.సురేంద్రనాథ్, హైదరాబాద్ కు చెందిన డా.విజయ భాస్కర్ రెడ్డి, ప్రొ.స్వర్ణ లత, బెంగుళూరుకు చెందిన డా.మహదేవన్ ఉన్నారన్నారు. ఈ కమిటీ వారంరోజులలో నివేదిక అందిస్తారని తెలిపారు. క్వాలిటీ నెయ్యి కోసం టెండర్ లో ఎలాంటి అంశాలు చేర్చాలని ఈ కమిటీ దిశ నిర్దేశం చేస్తుందన్నారు. నెయ్యికి సువాసన చాలా అవసరమని, వీటి ద్వారా రేటింగ్ వేయడానికి నివేదిక ఇవ్వాలని కమిటీని కోరినట్లు ఆయన చెప్పారు. ఓ సంస్థ అడల్ట్రేటెడ్ నెయ్యి ఇస్తున్నట్లు, వెటిటబుల్ ఫ్యాట్ కలుపుతున్నట్లు ఎన్ఏబిఎల్ టెస్ట్ లో తేలిందన్నారు.

టీటీడీకి సరఫరా చేస్తున్న నెయ్యి నమూనాలను క్షుణ్ణంగా తనిఖీ చేసేందుకు నేషనల్ అక్రిడిటేషన్ బోర్డ్ ఫర్ టెస్టింగ్ అండ్ కాలిబ్రేషన్ లాబొరేటరీస్‌కు పంపినట్లు తెలిపారు. టీటీడీకి నెయ్యి సరఫరా చేస్తున్న ఐదుగురు సరఫరాదారులలో ఒకరు అందించిన నెయ్యి నాణ్యత ప్రమాణాలు సరిపోలడం లేదని, కల్తీ నెయ్యిని సరఫరా చేస్తున్నట్లు పరీక్షల్లో నిర్ధారణ అయ్యిందని చెప్పారు. టెండర్ నిబంధనలను ఉల్లంఘించినందుకు ఒక కంపెనీని బ్లాక్ లిస్ట్ లో పెట్టామన్నారు. మరో కంపెనీపై చర్యలు తీసుకుంటామన్నారు. రెండు కంపెనీలకు షోకాజ్ నోటీసులు జారీ చేసినట్లు వివరించారు.

కళ్యాణ కట్టలో పరిశుభ్రత మెరుగవ్వాలి

శ్రీవారి కల్యాణ కట్టలో పరిశుభ్రత ఇంకా మెరుగుపరచాలని, తలనీలాలు సమర్పించే భక్తులకు నిరంతరాయంగా వేడి నీరు అందేలా చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఈవో జె.శ్యామలరావు ఆదేశించారు. తిరుమలలోని ప్రధాన కళ్యాణ కట్టను ఈవో, జేఈఓ (విద్యా, ఆరోగ్యం) గౌతమితో కలిసి కళ్యాణకట్టలో భక్తులకు అందుతున్న సౌకర్యాలను పరిశీలించారు. కళ్యాణ కట్టలో విధులు నిర్వహిస్తున్న సిబ్బందికి డిటిఎస్ ఏజెన్సీ వారు నాణ్యమైన శానిటరీ పరికరాలు, వస్తువులు ఎప్పటికప్పుడు సరఫరా చేసేటట్లు చర్యలు తీసుకోవాల్సిందిగా సంబంధిత అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా కళ్యాణ కట్టలోని అత్యంత పాత గీజర్లు, పగిలిన టైల్స్ ను గమనించి వాటిని వెంటనే మార్చాలని ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు. అనంతరం ఈవో మాతశ్రీ తరిగొండ వెంగమాంబ అన్నప్రసాద కేంద్రాన్ని తనిఖీ చేశారు. టిటిడి అందిస్తున్న అన్న ప్రసాదాలలో అన్నం బాగా ఉడికిందా, కూరలు ఎలా ఉన్నాయని భక్తులను అడిగి తెలుసుకున్నారు. అన్నప్రసాదాలపై భక్తులు సంతప్తి వ్యక్తం చేశారు. కార్యక్రమంలో జేఈఓ వీరబ్రహ్మం, అన్నదానం డిప్యూటీఈవో రాజేంద్ర, ప్రత్యేక అధికారి శాస్త్రి, ఆరోగ్యశాఖ డిప్యూటీ ఈవో ఆశాజ్యోతి పాల్గొన్నారు.



విద్యారంగ సమస్యలు పరిష్కరించాలని వినతి

ప్రజాశక్తి - తిరుపతి టౌన్

విద్యారంగ సమస్యలను సత్వరమే పరిష్కరించాలని యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి ఎస్ఎస్ నాయుడు, జిల్లా ప్రధాన కార్యదర్శి ముత్యాలరెడ్డి డిమాండ్ చేశారు. జిల్లా రెవెన్యూ అధికారి పెంచల్ కిషోర్‌కు వినతిపత్రం సమర్పించారు. జీవో నెంబర్ 117 రద్దుచేసి, జిఓ ఎంఎస్ నెంబర్ 55 ప్రకారం టీచర్లను కేటాయించాలని, ఫ్రీ ప్రైమరీతోపాటు ఒకటి నుండి ఐదు తరగతులు ఒకే పాఠశాలగా నడపాలని, రాష్ట్రవ్యాప్తంగా ఒకే సిలబస్, ఒకే పరీక్షా విధానం అమలు చేయాలని, హై స్కూల్స్ నందు రెండు మీడియంలను సమాంతరంగా కొనసాగించాలని, ఉపాధ్యాయులను బోధ నేతర పనుల నుండి మినహాయించి, పనిభారం తగ్గించాలని డిమాండ్ చేశారు. హైస్కూళ్లలో నాన్ టీచింగ్ సిబ్బందిని నియమించాలన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు దేవరాల నిర్మల, కందల శ్రీదేవి, బండి మధుసూదన్‌రెడ్డి, సి.సురేష్, దండు రామచంద్రయ్య, అవనిగడ్డ పద్మజ పాల్గొన్నారు.

'ఆధార్ సేవలు వినియోగించుకోండి'



ప్రజాశక్తి-శ్రీకాళహస్తి: ప్రతి ఒక్కరూ రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన ఆధార్ కేంద్ర సేవలను వినియోగించుకోవాలని తొట్టంబేడు మండల ఎంపీడీవో ఐజాక్ ప్రవీణ్ పిలుపునిచ్చారు. మంగళవారం ఆయన తొట్టంబేడు మండలంలోని బసవయ్యపాళ్యం సచివాలయంలో ఏర్పాటు చేసిన ప్రత్యేక ఆధార్ సెంటర్‌ను తనిఖీ చేశారు. అక్కడ వినియోగదారులకు అందుతున్న సేవలను అడిగి తెలుసుకున్నారు. ఐదేళ్ల లోపు పిల్లలకు కేంద్రంలో ఉచితంగా ఆధార్ నమోదు చేసుకోవచ్చని ఎంపిడివో తెలిపారు. ఆధార్‌లో ఏమైనా అడ్రస్ తేడాలున్నా సరి చేసుకోవచ్చని, అలాగే ప్రస్తుతం ఉన్న ఫోటోను కూడా సవరించుకోవచ్చని అన్నారు. మొబైల్ నెంబరును కూడా అనుసంధానం చేసుకోవచ్చని తెలిపారు. ఈ నెల 24వ తేదీన పెద్ద కన్నలి, 25వ తేదీన పొయ్య, 26వ తేదీన ఇలగనూరు, 27వ తేదీన రౌతు సూరమాల సచివాలయాల పరిధిలో ప్రత్యేక ఆధార్ కేంద్రాలు నిర్వహించబడతాయని తెలిపారు. ప్రజలందరూ సద్వినియోగము చేసుకోవాల్సినదిగా కోరారు. ఈవోపీఆర్డీ కరుణాక్షరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

తిరుపతి డెస్క్: నాగలాపురం మండల కేంద్రంలోని సచివాలయం-1లో ఏర్పాటు చేసిన ప్రత్యేక ఆధార్ క్యాంపును ఎంపీడీవో బాబు మంగళవారం ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ ఆధార్ తీసుకుని పదేళ్లు దాటిన వారికి అప్‌డేట్ చేయడంతో పాటు ఇంటి అడ్రస్, వయసు, పేరు మార్పు, కొత్త ఆధార్ నమోదు వంటి సేవలు అందించనున్నారు. ఈవోపీఆర్డీ నాగరత్నమ్మ, సర్పంచ్ సుధా చిన్న దొరై పాల్గొన్నారు.

అన్నదానం

ప్రజాశక్తి-గూడూరు టౌన్: పట్టణంలోని వీరభద్రుని ఆలయంలో మంగళవారం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఆలయ కమిటీ చైర్మన్ తుమ్మూరు ముని మోహన్ మాట్లాడుతూ దాతల సహకారంతో ప్రతి మంగళవారం క్రమం తప్పకుండా అన్నదాన కార్యక్రమం చేపడుతున్నమన్నారు. దాతల సహకారం మరువలేనిది అన్నారు. కార్యక్రమానికి దాతలుగా మీనుగుల రమాదేవి జ్ఞాపకార్థం డాక్టర్ వెంకట్ అరవింద్ వ్యవహరించారు.

ఎల్లమ్మకు పట్టు వస్త్రాల సమర్పణ

ప్రజాశక్తి-రేణిగుంట: రేణిగుంట ఎల్లమ్మకు శ్రీకాళహస్తి ఎమ్మెల్యే బొజ్జల వెంకట సుధీర్ రెడ్డి సతీమణి బొజ్జల రిషితా రెడ్డి మంగళవారం పట్టు వస్త్రాలు సమర్పించారు. కార్యక్రమంలో ఆలయ ధర్మకర్త ఎలుమలై కన్నా రెడ్డి, టీడీపీ మండల అధ్యక్షులు ముని చంద్రారెడ్డి, పట్టణ అధ్యక్షులు మహబూబ్ బాషా, క్లస్టర్ ఇన్‌ఛార్జ్ డిపి సుబ్రహ్మణ్యం రెడ్డి, నవాబమేరీ సుధా అమీదా తదితరులు పాల్గొన్నారు.

కంటి వైద్య శిబిరానికి విశేష స్పందన

ప్రజాశక్తి-పుత్తూరు టౌన్: పట్టణంలోని రాచపాళ్యం సచివాలయంలో చెన్నై శంకర్ నేత్రాలయం సహకారంతో మంగళవారం నిర్వహించిన ఉచిత కంటి వైద్య శిబిరానికి విశేష స్పందన లభించిందని నిర్వాహకులు తెలిపారు. రాస్ ప్రధాన కార్యదర్శి వెంకటరత్నం, నాగరాజు ఆదేశాలతో ఈ కార్యక్రమాన్ని నిర్వహించినట్లు వారు తెలిపారు. శిబిరంలో 170మందికి పరీక్షలు చేయగా 36మంది శస్త్ర చికిత్సలు చేయాల్సి ఉందన్నారు. వారికి పూర్తి ఉచితంగా చికిత్స చేయించడంతో పాటు రానుపోనూ సౌకర్యాలు కల్పించనున్నట్లు వారు స్పష్టం చేశారు. ప్రభుత్వ పాఠశాల హెచ్‌ఎం కుమారస్వామి, రాస్ రవి, ప్రకాష్, ద్రాక్షాయణి, రమేష్ బాబు, రజిని, హరి, ప్రతాప్ రాజు, సహాయకులు పాల్గొన్నారు.

'పారిశుద్ధ్యాన్ని మెరుగుపరచండి'

ప్రజాశక్తి-గూడూరు టౌన్: పట్టణంలో పారిశుద్ధ్యాన్ని మెరుగుపరచాలని మాజీ కౌన్సిలర్‌లు బిల్లు చెంచు రామయ్య, తాతపూడి ఇశ్రాయేల్ కుమార్‌లు సూచించారు. మంగళవారం గూడూరు రెండవ పట్టణంలోని మాళవ్య నగర్ వాటర్ ట్యాంక్ ప్రాంగణంలో 15, 16, 17 సచివాలయాల పరిధిలోని పారిశుద్ధ్య సిబ్బంది హాజరు కేంద్రానికి వెళ్ళి, సిబ్బంది హాజరు శాతాన్ని తనిఖీ చేశారు. వర్షాకాలంలో డెంగీ, మలేరియా, డయేరియా లాంటి అంటు వ్యాధులు ప్రబలకుండా, పారిశుధ్యాన్ని మెరుగుపరిచేందుకు పలు సూచనలు చేశారు. వీరి వెంట శానిటరీ ఇన్‌స్పెక్టర్‌లు పోలయ్య, రాజేష్, సిబ్బంది ఉన్నారు.

ఆరోగ్య జాగ్రత్తలు పాటించాలి

ప్రజాశక్తి-బుచ్చినాయుడు కండ్రిగ: ప్రతి ఒక్కరు ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని మండల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ దివాకర్ అన్నారు. మంగళవారం మండలంలోని కంచన పుత్తూరు నిర్నికండ్రిగలో డయేరియా, డెంగీ పట్ల ప్రజలకు అవగాహన కల్పించారు. గ్రామాల్లో పరిశుభ్రత పాటించాలని ఈ సందర్భంగా పంచాయతీ కార్యదర్శి ఇందిరా అవగాహన కల్పించారు.

శ్రామిక్ నగర్‌లో పారిశుద్ధ్య చర్యలు చేపట్టండి




ప్రజాశక్తి-గూడూరు టౌన్: పట్టణంలోని జక్క వెంకయ్య శ్రామిక నగర్‌లో పారిశుద్ధ్యాన్ని మెరుగుపరచాలని గూడూరు సిపిఎం నాయకులు గూడూరు పురపాలక కమిషనర్‌కి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా సిపిఎం సెంట్రల్ శాఖ కార్యదర్శి జోగి శివ కుమార్ మాట్లాడుతూ జక్కా వెంకయ్య శ్రామిక నగర్‌లో గత 20సంవత్సరాలు నుంచి సుమారు 50కుటుంబాలు జీవనం సాగిస్తున్నట్లు చెప్పారు. ఇలాంటి తరుణంలో గత కొన్ని రోజుల నుంచి డ్రైనేజీ, వ్యర్థ పదార్థాలు మొత్తం ఇంటి లోపలకు వెళుతున్నాయన్నారు. దీంతో వారు అనారోగ్య పాలవుతున్నారన్నారు. వెంటనే పారిశుద్ధ్య చర్యలు చేపట్టాలన్నారు. కార్యక్రమంలో సిపిఎం నాయకులు శ్రీనివాసులు, రమణయ్య, ప్రసాద్, కోటి తదితరులు పాల్గొన్నారు.

ఆగస్టు 15న అన్న క్యాంటీన్లు ప్రారంభించాలి

- ఆ మేరకు మున్సిపల్ కమిషనర్‌లు చర్యలు తీసుకోవాలి
- కలెక్టర్ వెంకటేశ్వర్లు

ప్రజాశక్తి-తిరుపతి టౌన్: పేదలకు నామ మాత్రపు ధరతో ఆకలి తీర్చేందుకు ప్రభుత్వం అన్న క్యాంటీన్‌లను జిల్లాలోని అన్ని నియోజకవర్గాలలోని మున్సిపల్ పరిధిలో ఆగస్ట్ 15 నుంచి తప్పక ప్రారంభించేలా చర్యలు తీసుకోవాలని అధికారులను కలెక్టర్ డాక్టర్ ఎస్.వెంకటేశ్వర్ ఆదేశించారు. మంగళవారం స్థానిక కలెక్టరేట్ నుంచి జిల్లాలోని 7 మున్సిపాలిటీల కమిషనర్లతో వర్చువల్ విధానంలో మాట్లాడుతూ ఆగస్ట్ 15 నాటికి జిల్లాలో 11 అన్నా క్యాంటీన్లు ప్రారంభం కావాలన్నారు. తిరుపతిలో 4 క్యాంటీన్లు ఎంఆర్‌పల్లి, ఈఎస్‌ఐ ఆసుపత్రి సమీపంలో, నెహ్రూ మున్సిపల్ గ్రౌండ్స్, న్యూ బాలాజీ కాలనీలలో గతంలోని అన్నా క్యాంటీన్ భవనాలను



మరమ్మతులు పూర్తి చేసి జులై 31 నాటికి సిద్ధం చేయాలని సూచించారు. శ్రీకాళహస్తి మున్సిపాలిటీలో 2 క్యాంటీన్లు రామసేతు బ్రిడ్జి వద్ద, ప్రభుత్వ ఆసుపత్రి రోడ్‌లో గుర్తించిన భవనాలు మరమ్మతులు ఆగస్ట్ 10 నాటికి పూర్తి చేసి సిద్ధంగా ఉంచాలన్నారు. అలాగే నాయుడుపేట మున్సిపాలిటీలో ఆర్టీసీ బస్ స్టాండ్ సమీపంలోని ఆటో స్టాండ్ వద్ద గుర్తించిన భవనాలు మరమ్మతులు పూర్తి చేయాలన్నారు. సూళ్లూరుపేట మున్సిపాలిటీలో కళాక్షేత్రం ఎదురుగా, గాండ్ల వీధిలో గుర్తించిన భవనం మరమ్మతులు ఆగస్ట్ 5 నాటికి పూర్తి చేసి ప్రారంభానికి సిద్ధం చేయాలన్నారు. గూడూరు పట్టణంలోని పాత బస్ స్టాండ్ సమీపంలోని బొగ్గుల దిబ్బ వీధిలోని భవనాన్ని మరమ్మతులు చేపట్టాలన్నారు. వెంకటగిరి మున్సిపాలిటలో ఎంపిడిఓ కార్యాలయ సమీపంలో మరమ్మతులకు చర్యలు తీసుకోవాలన్నారు. పుత్తూరు మున్సిపాలిటీలో సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం వద్ద కొత్తగా నిర్మాణం చేపట్టడానికి టెండర్లు పిలిచామని, సమయం పడుతుందని కమిషనర్ తెలిపారు. సమావేశంలో డీఆర్‌వో పెంచల కిషోర్, ఏడు మున్సిపాలిటీల మున్సిపల్ కమిషనర్లు, కలెక్టరేట్ సెక్షన్ డిటి శ్రీనివాస్, ఇతర అధికారులు పాల్గొన్నారు.

ఆలోచింపజేసిన 'శిథిల జీవి'

ప్రజాశక్తి-తిరుపతి సిటీ: అభినయ ఆర్ట్స్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న జాతీయ నాటక ఉత్సవాల్లో భాగంగా మంగళవారం స్థానిక మహతి ఆడిటోరియంలో జరిగిన ప్రదర్శనలు శిథిలజీవి సాంఘిక నాటక ప్రదర్శన ప్రేక్షకులను ఆలోచింపజేసింది. విశాఖపట్నం పెందుర్తికి చెందిన శ్రీ నటరాజ డెమొక్రటిక్ అసోసియేషన్ కళాకారులు ప్రదర్శించే ఈ సాంఘిక నాటకంలో రెక్కాడితే గాని డొక్కాడని బ్రతుకులు తమ కోర్కెలు తీర్చుకోవడానికి జీవితాలే బలి బతుకులో అమలయ్య ఒకడు కాయ కష్టం చేసుకుని బతుకుతున్నాడు. మునెమ్మ అమలయ్య జీవితంలోకి ప్రవేశించింది. ఒకరోజు మనం చిన్న గూడు కట్టుకుందాం అంది. ఇద్దరు కష్టపడదామంది. అన్నట్టుగానే అప్పు చేసి స్థలం కొంది. అప్పు చేసి ఆ స్థలంలో గుడిసె నిర్మించుకుంది. ఆ అప్పు తీర్చేందుకు మునమ్మ గల్ఫ్‌కి వెళ్ళింది. గల్ఫ్‌లో సేట్లు పెట్టే బాధను అనుభవించి, అనారోగ్యానికి గురై మృతి చెందింది.



ఆమె రాక కోసం ఎదురు చూస్తున్న భర్త అమలయ్య శవంలా తిరుగు వచ్చిన మునెమ్మను చూసి బోరెను విలిపించాడు. ఓ రోజు రాత్రి ఆమె సమాధిని తవ్వుతుండగా ఊరు వాళ్ళు ఆయనపై అవయవాలు మోపి పంచాయితీకి లాగారు. తన భార్య చివర చూపు కోసం సమాధి తవ్వానని అసలు విషయం చెప్పడంతో ఊరు ప్రజలు నిర్ఘాంతపోయారు. ఈ కథలో కళాకారులు ప్రతి ఒక్కరిని మెప్పించే రీతిలో ప్రదర్శించారు.

గూడూరును నెల్లూరు జిల్లాలో కలపండి

- మంత్రి లోకేష్‌కి ఎమ్మెల్యే వినతి

ప్రజాశక్తి-గూడూరు టౌన్: గూడూరును నెల్లూరు జిల్లాలో కలపాలని మంత్రి లోకేష్‌కు గూడూరు ఎమ్మెల్యే పాశం సునీల్‌కుమార్ విజ్ఞప్తి చేశారు. మంగళవారం అసెంబ్లీ సమావేశాలులో భాగంగా సెక్రటేరియట్‌లో మంత్రిని ఎమ్మెల్యే కలిసి పలు అంశాలను ఆయన దృష్టికి



తీసుకెళ్లి వినతి పత్రం అందజేశారు. యువగళం పాదయాత్రలో ప్రజలు గూడూరు నెల్లూరు జిల్లాలో కలపాలని కోరిన విషయాన్ని మంత్రికి గుర్తు చేశారు. ప్రజల ఆకాంక్ష మేరకు నియోజకవర్గాన్ని నెల్లూరు జిల్లాలో కలపాలని కోరారు. ఎమ్మెల్యే ప్రతిపాదనను విన్న మంత్రి సానుకూలంగా స్పందించి విషయాన్ని సీఎం దృష్టికి తీసుకెళ్లి త్వరలో నిర్ణయాన్ని తెలుపుతామని స్పష్టం చేశారు. ఎమ్మెల్యే వెంట చిట్టమూరు మండల పార్టీ అధ్యక్షులు గణపర్తి కిషోర్ నాయుడు, తదితరులు పాల్గొన్నారు.

బస్సు సర్వీసులు ఏర్పాటు చేయండి

- మంత్రికి నగరి ఎమ్మెల్యే వినతి


ప్రజాశక్తి-పుత్తూరు టౌన్: గ్రామీణ ప్రాంతాల్లో ప్రజల సౌకర్యం కోసం ఏపీఎస్ ఆర్టీసీ బస్ సర్వీసులను అవసరమైన మేరా కల్పించాలని మంత్రి రాంప్రసాద్ రెడ్డిని నగరి ఎమ్మెల్యే గాలి భానుప్రకాష్ కోరారు. మంగళవారం విజయవాడలోని సచివాలయంలో మంత్రికి విజ్ఞప్తి చేశారు. స్పందించి మంత్రి బస్సు సర్వీసులు ఏర్పాటు చేయడానికి హామీ ఇచ్చారు.



చంద్రగిరి అభివృద్ధికి నిధులు కేటాయించండి

- సీఎంకి ఎమ్మెల్యే పులివర్తి నాని వినతి

ప్రజాశక్తి-రామచంద్రపురం: చంద్రగిరి నియోజకవర్గ అభివృద్ధికి ప్రత్యేక నిధులు కేటాయించాలని, స్వర్ణముఖిపై బ్రిడ్జిల పునర్నిర్మాణానికి సహకరించాలని సీఎం చంద్రబాబుని ఎమ్మెల్యే పులివర్తి వెంకటమణి ప్రసాద్ (నాని) కోరారు. మంగళవారం అమరావతిలో అసెంబ్లీ సమావేశం ముగిసిన అనంతరం సీఎంని క్యాంప్ ఆఫీస్‌లో కలిసి నియోజకవర్గంలో 2022లో తుఫాను ప్రభావం వల్ల దెబ్బతిన్న తిరుచానూరు, తనపల్లి,



రాయలచెరువు, ఐతేపల్లి బ్రిడ్జిల పునర్నిర్మాణం, నియోజకవర్గం వ్యాప్తంగా దెబ్బతిన్న రహదారుల మరమ్మతులు, డబల్ రోడ్ల నిర్మాణానికి, తలకోన బ్యాక్ వాటర్‌ని ప్రతి చెరువుకు అనుసంధానం చేసేందుకు సహకరించాలని కోరారు. ఎమ్మెల్యే నాని విజ్ఞాపనకు సీఎం చంద్రబాబు సానుకూలంగా స్పందించి నిధులు మంజూరు చేస్తానని చెప్పినట్లు ఎమ్మెల్యే తెలిపారు.

దివ్యాంగులకు స్మిత సబర్వాల్ క్షమాపణ చెప్పాలి: తవితా తులసి

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం): సమాజం గౌరవించే ఉన్నత హోదా కలిగిన ఐఏఎస్ అధికారి స్మిత సబర్వాల్ యావత్ దివ్యాంగులకు క్షమాపణలు చెప్పాలని శ్రీ పద్మావతి మహిళా వర్సిటీ ప్రొఫెసర్ తవితా తులసి, పిడబ్ల్యుడి ఫెడరేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సుబ్రమణ్యం డిమాండ్ చేశారు. మంగళవారం తిరుపతి ప్రెస్‌క్లబ్‌లో వారు మాట్లాడారు. ఈ నెల 20న స్మిత సబర్వాల్ దివ్యాంగులకు రిజర్వేషన్లు తేసేయాలని ట్వీట్ చేయడం యావత్ భారతదేశంలో ఉన్న దివ్యాంగుల మనోభావాలను దెబ్బతీసిందన్నారు. ఇప్పటికే రాష్ట్రంలోని అన్ని కేంద్రాలలో దివ్యాంగులు ఈ ట్వీట్‌పై మండిపడుతున్నారన్నారు. ఎస్వీయు అకాడమిక్ కన్సల్టెంట్ డాక్టర్ అమరేశ్వరి మాట్లాడుతూ



విలేకరులతో మాట్లాడుతున్న తవితా తులసి

రాజ్యాంగం ప్రకారం దేశంలో అందరూ సమానమేనని దివ్యాంగులను కించపరిచే వారే నిజమైన దివ్యాంగులని ఐఏఎస్ అధికారిని స్మిత సబర్వాల్ ట్వీట్‌పై ఘాటుగా స్పందించారు. స్మితా సబర్వాల్ దివ్యాంగులకు క్షమాపణలు చెప్పని పక్షంలో నిరసనలను ఉధృతం చేస్తామని హెచ్చరించారు. లా విద్యార్థి వెంకటరమణ, లక్ష్మి, మధులత పాల్గొన్నారు.

స్వాతంత్ర్య సమర యోధులను స్మరించడం మరవొద్దు

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి: పట్టణంలోని ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల ఆవరణలో శ్రీకాళహస్తి భారత్ స్కౌట్స్ అండ్ గైడ్స్ ఆధ్వర్యంలో బాలగంగాధర్ తిలక్, చంద్రశేఖర్ ఆజాద్ జయంతిని మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారి చిత్రపటాల వద్ద నివాళులర్పించారు. అనంతరం ప్రిన్సిపాల్ రాజశేఖర్ రెడ్డి మాట్లాడుతూ బాలగంగాధర్ తిలక్, చంద్రశేఖర్ ఆజాద్ స్వాతంత్ర దినోత్సవం కోసం పోరాడిన ముఖ్యమైన వ్యక్తులనీ, స్వతంత్ర్య సమర యోధులను స్మరించుకోవడం మన బాధ్యతని గుర్తు చేశారు. స్కౌట్స్ ఇన్‌ఛార్జ్ నరసింహారావు



మాట్లాడుతూ చంద్రశేఖర్ ఆజాద్ గొప్పతనాన్ని వివరించారు. కార్యక్రమంలో జిల్లా యూత్ చైర్మన్ షేక్ అజారుద్దీన్, స్కౌట్ మాస్టర్ సుబ్రహ్మణ్యం, కళాశాల పీడీ నరసింహారావు, ధనుష్, రేంజర్ లీడర్లు సంఘవి, వైష్ణవి, కీర్తి, స్కౌట్స్ గైడ్స్ పాల్గొన్నారు.

ముదిరాజ్‌లకు న్యాయం చేయండి: నారాయణ



విలేకరులతో మాట్లాడుతున్న నారాయణ ముదిరాజ్

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం): రాష్ట్ర వ్యాప్తంగా 20లక్షలకు పైగా ఉన్న ముదిరాజ్ కులానికి న్యాయం జరగాలంటే బిసి-డి నుంచి బీసీ-ఏకు మార్చాలని ముదిరాజ్ మహాసభ రాష్ట్ర అధ్యక్షులు నారాయణ ముదిరాజ్ రాష్ట్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. మంగళవారం తిరుపతి ప్రెస్‌క్లబ్లో ఆయన మాట్లాడారు. ఎస్టీ జాబితాలో ఉండాల్సిన ముదిరాజ్‌లు ఉమ్మడి రాష్ట్రంలో కోటి మందికిపైగా ఉండడంతో అప్పట్లో బిసి-డి నుంచి బిసి-ఏ జాబితాలో చేర్చారన్నారు. రాష్ట్రం వీడిపోయాక బీసీ-ఏ పై కొందరు కోర్టుకెళ్లారన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా ముదిరాజ్‌లు అభివృద్ధికి నోచుకోక, ఆర్థికంగా ఎదగలేక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కోవాల్సిన పరిస్థితులు ఏర్పడ్డాయన్నారు. ఇప్పటికైనా రాష్ట్ర సీఎం చంద్రబాబు కలుగజేసుకొని ముదిరాజ్ కులానికి న్యాయం చేయాలని విజ్ఞప్తి చేశారు. సమావేశంలో నారాయణమ్మ, హేమలత, లక్ష్మీకాంత్ పాల్గొన్నారు.

మధ్యాహ్న భోజనం తనిఖీ



ప్రజాశక్తి-నాయుడుపేట: నాయుడుపేట మున్సిపాలిటీలోని జెడ్పీ బాలికల ఉన్నత పాఠశాలలో మధ్యాహ్న భోజనంలో పిల్లలకు గుడ్లు నాణ్యతపై పత్రిల్లో వచ్చిన వార్తలపై జిల్లా ఉన్నతాధికారులు స్పందించారు. మంగళవారం డీఈవో డాక్టర్ శేఖర్ పాఠశాల హెచ్‌ఎం, సిబ్బంది, మధ్యాహ్న భోజన ఏజన్సీలతో విచారణ చేపట్టారు. సిబ్బందికి పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో ఏఎంవో శివశంకర్, గూడూరు ఉప విద్యాశాఖ అధికారి శాంతి, మండల విద్యాశాఖ అధికారి మునిరత్నం పాల్గొన్నారు.

తేజాకు ప్రెస్‌క్లబ్ సభ్యుల పరామర్శ



ప్రజాశక్తి-శ్రీకాళహస్తి: సీకేఎన్ న్యూస్ రిపోర్టర్ తేజాను మంగళవారం శ్రీకాళహస్తి ప్రెస్ క్లబ్ సభ్యులు పరామర్శించారు. తేజా మాతృమూర్తి సోమవారం అనారోగ్యంతో మృతి చెందిన సంగతి తెలిసిందే. ఆ మేరకు మంగళవారం ప్రెస్‌క్లబ్ సభ్యులు ఆమె అంత్యక్రియల్లో పాల్గొని నివాళులర్పించారు. తేజాను పరామర్శించి ప్రెస్ క్లబ్ తరపున అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. రూ.41,500 ఆర్థిక సాయమందించారు. ప్రెస్ క్లబ్ అధ్యక్షులు ఏ.కామేష్, ప్రధాన కార్యదర్శి బి.చంద్రశేఖర్, గౌరవాధ్యక్షులు వీసీ వెంకటయ్య, సీనియర్ పాత్రికేయులు మెహర్, నెల్లూరు శ్రీనివాసులు, హరీష్, రఫీ, బత్తెయ్య, బాలసుబ్రమణ్యం, ధనశేఖర్, వెంకటేష్ పాల్గొన్నారు.

హత్య కేసులో నిందితుడి అరెస్ట్

ప్రజాశక్తి-తిరుపతి సిటీ: వృద్ధురాలు హత్య కేసులో నిందితుడిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఆ మేరకు మంగళవారం ఎస్పీ సుబ్బారాయుడు విలేకరుల సమావేశంలో వివరాలను వెల్లడించారు. తిరుపతి రాయల్ నగర్‌లో ఈనెల 18న హత్య జరిగిన విషయం విధితమే. నిందితుడు చిన్నబోయిన శ్రీనివాసులు ముందస్తు ప్రణాళిక ప్రకారం గేట్ తెరచి ఉన్న మృతురాలు ఇంట్లోకి



ప్రవేశించి, అదే సమయంలో ఇంటిలో ఉన్న వారి కదలికలను గమనిస్తూ ఉన్నట్లు చెప్పారు. ఇంట్లోని వారు డ్రైవింగ్ క్లాస్‌కి వెళ్ళిన సమయంలో నిందితుడు వృద్ధురాలు జయలక్ష్మిని చంపి, చిన్నకుమార్తె మెడ మీద కత్తితో గాయపరచగా రక్తపు మడుగులో స్పృహ తప్పి పడిపోయింది. తరువాత డ్రైవింగ్ క్లాసు నుంచి వచ్చిన పెద్దకుమార్తె తల మీద కత్తితో దాడి చేసి వారి స్కూటర్‌ను తీసుకొని అక్కడి నుంచి పరిపోయాడు. రైల్వే స్టేషన్ దగ్గర స్కూటర్‌ను వదిలి, ట్రైన్ ఎక్కి రేణిగుంటలో దిగి, మళ్ళీ జీపు ఎక్కి తిరుమలకు వెళ్ళి గుండు చేయించుకుని అక్కడే ఉండి, 23వ తేదీ మంగళవారం చెర్లోపల్లి వద్ద నిందితుడు తిరుగుతున్నట్లు గుర్తించి అదుపులోకి తీసుకున్నట్లు వెల్లడించారు. నిందితుడి అరెస్ట్‌కు సహకరించిన పోలీసులను ఆయన అభినందించారు. సమావేశంలో ఏఎస్పీ కులశేఖర్, డిఎస్పి రవి మనోహరాచారి, అధికారులు పాల్గొన్నారు.

జగన్ ధర్నా దేని కోసం?: కిరణ్ రాయల్



విలేకరులతో మాట్లాడుతున్న కిరణ్ రాయల్

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం): గత ఐదేళ్ల అధికారంలో ఏనాడైనా రాష్ట్ర ప్రయోజనాల కోసం గానీ, తన బాబాయిని ఎవరు హత్య చేశారో అన్న అంశాలపై ఏనాడైనా మాజీ సీఎం జగన్‌మోహన్ రెడ్డి దేశ రాజధాని ఢిల్లీ వెళ్లి ధర్నా చేశారా?, ఇక జగన్ ధర్నా దేనికోసం అని కిరణ్ రాయల్ ప్రశ్నించారు. మంగళవారం తిరుపతి ప్రెస్‌క్లబ్‌లో ఆయన మాట్లాడారు. జగన్ తాను అధికారంలో ఉన్నప్పుడు రాష్ట్ర వ్యాప్తంగా ఎన్నో హింసాత్మక ఘటనలు జరగడానికి కారకులయ్యారని, నేడు వైసీపీ పార్టీకే చెందిన వారు అంతర్గత కలహాలతో హత్యలు చేసుకుంటే దాన్ని కూటమి ప్రభుత్వంపై నెడుతూ అలజడి సృష్టించడానికి ప్రయత్నం చేస్తున్నారన్నారు. జగన్మోహన్ రెడ్డి ఇంకా తానే సీఎం అనుకుంటూ ఆ భ్రమలో ఉండి మాట్లాడుతున్నారని ఎద్దేవా చేశారు. అన్నమయ్య జిల్లా మదనపల్లె సబ్ కలెక్టర్ కార్యాలయం అగ్నిప్రమాదం ఓ కుట్రగా ఉందని, త్వరలోనే దీని వెనుక ఉన్న వారిని బయట పెడతా మని స్పష్టం చేశారు. ఇంకా రాష్ట్ర వ్యాప్తంగా ప్రభుత్వ కార్యాలయాల్లో వైసీపీ సానుభూతిపరులు ఉద్యోగుల రూపంలో ఉండి పనిచేస్తున్నారని వారి భరతం కూడా పడతామన్నారు. మదనపల్లెలో అగ్నిప్రమాదం వెనుక మాజీ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి అనుచరులే ఉంటారని అనుమానం వ్యక్తం చేశారు. జగన్ ఇలా ఎన్ని కుట్రలు చేసిన ఇక 15 ఏళ్ల వరకు అధికారం చేపట్టలేదని స్పష్టం చేశారు. డిప్యూటీ సీఎం కొనిదెల పవన్ కళ్యాణ్‌కు భద్రత పెంచాల్సిన బాధ్యత కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలపై ఉందన్నారు. రాష్ట్రానికి అవసరమైన ముఖ్య వ్యక్తిగా పరిగణించి బ్లాక్ కమాండోస్ ఇవ్వాలని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తున్నామన్నారు. సమావేశంలో నాయకులు సుమన్, సుభాషిని, సుమంత్ తదితరులు పాల్గొన్నారు.

కోర్సు ముగిసినా ధ్రువపత్రాలు ఇవ్వడం లేదు

- తిరుపతి పద్మావతి మహిళా విశ్వవిద్యాలయం విద్యార్థులు

ప్రజాశక్తి - మంగళగిరి (గుంటూరు జిల్లా): గత వైసిపి ప్రభుత్వం విద్యార్థుల భవిష్యత్తుతో చెలగాటం ఆడిందని జనసేన పార్టీ మంగళగిరి నియోజకవర్గ ఇన్‌ఛార్జి సిహెచ్.శ్రీనివాసరావు విమర్శించారు. తిరుపతి పద్మావతి మహిళా విశ్వవిద్యాలయంలో 2020-23లో చదివిన విద్యార్థులు తమకు అన్యాయం జరిగిందని, న్యాయం చేయాలని శ్రీనివాసరావు మంగళవారం విన్నవించగా ఆయన స్థానిక జనసేన కార్యాలయంలో విలేకర్లతో మాట్లాడారు. ఎస్సీ, ఎస్టీ విద్యార్థులకు ఉపయోగకరంగా ఐఎఎస్, ఐపిఎస్ కోర్స్‌తో పాటు ఫీజు రీయింబర్స్‌మెంట్ ప్రవేశపెట్టి చంద్రబాబు ఎంతో మేలు చేశారని అన్నారు. జగన్ పరిపాలనలో ఎస్సీ, ఎస్టీ విద్యార్థుల రీయింబర్స్‌మెంట్ సదుపాయాలు కల్పించలేదని



విద్యార్థినులతో కలిసి మీడియాతో మాట్లాడుతున్న సిహెచ్ శ్రీనివాసరావు

విమర్శించారు. విద్యార్థులు మాట్లాడుతూ కోర్సు అయిపోయాక ధ్రువపత్రాలు అడుగుతుంటే ఫీజులు పూర్తిగా చెల్లిస్తేనే ఇస్తామంటున్నారని చెప్పారు. సచివాలయ సిబ్బంది, ఉన్నతాధికారులకు ఎన్నోసార్లు విన్నవించినా పట్టించుకోలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా తమకు న్యాయం జరుగుతుందనే ఆశతో పవన్‌కళ్యాణ్, నారా లోకేష్‌ను ఆశ్రయించినట్లు చెప్పారు. ఈ సమస్యను వారి దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తామని శ్రీనివాసరావు హామీనిచ్చారు.

అది చిరుత కాదు.. పిల్లి ఉండొచ్చు

ప్రజాశక్తి-సత్యవేడు: మండలం అల్లప్పగుంట గ్రామం సమీపంలో రైతు మునిశేఖరకు చిరుత పులి సంచరిస్తూ కనిపించిందని భయాందోళనకు గురై స్థానిక అటవీశాఖ రేంజ్ ఆఫీసర్‌కు సమాచారం ఇచ్చారు. అల్లపుగుంటకు చేరుకున్న అటవీశాఖ అధికారులు మునిశేఖర్‌కు అటవీ మృగాల ముఖచిత్రాలను చూపించి ప్రశ్నించగా కనిపించింది చిరుత పులి కాదని, అది అడవి పిల్లిగా ఉండొచ్చని సంబంధిత అటవీశాఖ బీట్ అధికారి వేణు స్పష్టం చేశారు. అల్లప్పగుంట పొలాల వద్ద చిరుత పులి సంచారం అంటూ సామాజిక మాధ్యమంలో మంగళవారం ఉదయం వార్త రావడంతో అటవీ శాఖ అధికారులు రంగంలోకి దిగారు. చిరుత జాడ కోసం అల్లప్పగుంట అడవి ప్రాంతాన్ని జల్లెడ పట్టారు. దీంతో పాటు ఆ ప్రాంతంలో సంచరించిన అటవీ జంతువు కాళీ జాడలను పరిశీలించారు. చిరుతపులి జాడ ఏదీ లేదని, రైతుకు అడవి పిల్లి కనిపించి ఉండొచ్చని ఆయన వివరణ ఇచ్చారు. ఏది ఏమైనా పొలాల్లో జంతువు సంచార గుర్తులుకు సంబంధించి జాడను ల్యాబ్ కు పంపుతున్నామని,దీని రిపోర్ట్ రాగానే తదుపరి చర్యలు తీసుకుంటామని అటవీ రేంజ్ ఆఫీసర్ జయ ప్రసాద్ రావు గారు తెలిపారు.ఏదేమైనా దీనిపై ప్రజలు భయాందోళనలకు గురికావాల్సిన అవసరం లేదన్నారు.రైతులు నిర్భయంగా వారి పొలాల వద్దకు వెళ్ళవచ్చు అన్నారు.

లారీ, కారు ఢీ

- ఒకరు మృతి

ప్రజాశక్తి-ఓజిలి: లారీని ఢీకొన్న సంఘటనలో ఒకరు మృతి చెందగా ఇద్దరికి గాయాలైయ్యాయి. వివరాలు.. ఓజిలి జాతీయ రహదారిలో మంగళ వారం ప్రకాశం జిల్లా చీమకుర్తి గ్రామానికి చెందిన చిన్నపురెడ్డి శ్రీను కుటుంబ సభ్యులతో కలిసి కారులో అరుణాచలం దైవదర్శనం చేసుకుని తిరిగి ప్రయాణం చేస్తున్న సమయంలో ఓజిలి మండలం రాజుపాలెం జాతీయ రహదారి క్రాస్ రోడ్డు వద్ద గూడూరు వైపు వెళ్తున్న లారీ ఒకసారిగా బ్రేక్ వేయడంతో వెనుక వైపు నుంచి కారు ఢీకొంది. చీమకుర్తి శ్రీను మృతి(40) చెందగా కుటుంబ సభ్యులకు గాయాలైయ్యాయి. సమాచారం తెలుసు కున్న ఓజిలి ఎస్ఐ రవిబాబు సంఘటన స్థలానికి చేరుకొని గాయపడిన వారిని చికిత్స నిమిత్తం గూడూరు ప్రభుత్వ ఏరియా ఆసుపత్రికి తరలిం చారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

అక్రమ రేషన్ బియ్యం పట్టివేత

ప్రజాశక్తి-తడ: మండలంలోని బొడిలింగాల పాడు హైవే క్రాస్ వద్ద 201 బస్తాల అక్రమ రేషన్ బియ్యం స్వాధీనం చేసుకున్నట్లు పోలీసులు తెలిపారు. మంగళవారం పోలీసుల తెలిపిన వివరాల మేరకు.. ముందుగా అందిన సమాచారంతో తడ కండ్రిగ వీఆర్‌వోతో కలిసి చెన్నై నుంచి నెల్లూరు వైపు వెళుతున్న మినీ ట్రక్కును ఆపి తనిఖీ చేశామన్నారు. అందులో రేషన్ బియ్యం తరలిస్తుండడాన్ని గుర్తించి సీజ్ చేశామని పోలీసులు తెలిపారు. వాటి విలువ సుమారు రూ.3లక్షలు ఉంటుందని అంచనా వేశారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు స్పష్టం చేశారు.

అనుమతి లేకుండా చెత్త డంపింగ్

- చర్యలు తీసుకున్న అధికారులు

ప్రజాశక్తి-తడ: మండలంలోని కండ్రిగ పంచాయతీ పరిధిలో డంపింగ్ యార్డ్ ఏరియాలో వ్యాపార నిమిత్తం చెత్తను నేషనల్ హైవే రోడ్డు మీదగా చెత్త వేస్తున్న సమయంలో గుర్తించిన అధికారులు వాహనాన్ని అదుపులోకి తీసుకున్నారు. ఈ దాడిలో అధికారులు డిఎల్‌పిఓ రవీంద్ర బాబు, ఎంపీడీవో విజయ్ కుమార్, సెక్రటరీ కలగాబ్రెల్ ఉన్నారు. చెత్త వేస్తున్న వాహన యజమానికి జరిమానా వేశారు.

In The Court of Hon'ble Principal Senior Civil Judge, Tirupati
O.S.No.9/2020
Yeddulacheruvu. Muneeswari and another ...Plaintiffs
V/s
Bandarupalli, Kuppa Reddy and 6 others ...Defendants

SUIT SUMMONS TO DEFENDANTS NO.1 AND NO.3

D1) Bandarupalli. Kuppa Reddy S/o late B.Muni Reddy, Rtd. Railway Employee, Kothapalem Village, Renigunta Mandal, Tirupati District.
D3) M.Manjulamma W/o M.Raghurami Reddy, Renigunta Check Post, Renigunta Mandal, Tirupati District.

Please take summons in above O.S.No.9/2020 is filed by the plaintiffs against you on the file of Honourable Principal Senior Civil Judge, Tirupati, seeking relief for partition in respect of suit schedule property and said suit is posted to 05.08.2024 for your appearance. Please attend on 05.08.2024 before aforesaid Honourable Court by 10.30 A.M. either you or through your advocate and file your objection if any otherwise matter will be decided on exparte.

By Court Order
V.MUNIKRISHNAIAH
Advocate for Plaintiffs, Tirupati